ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

గురువారం 9 మే 2024

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం 8లో..

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం 8లో..



కమలోత్సాహం

- వేములవాడలో మోదీ సభ సక్సెస్‌తో బీజేపీలో జోష్
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- రాజన్న ఆలయంలో 30 నిమిషాలు గడిపిన ప్రధాని
- బండి సంజయ్ విజయం ఖాయమైందని అనడంతో హోరెత్తిన సభ

సిరిసిల్ల/వేములవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నాయకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం ఎన్నికల వేములవాడ జన బహిరంగ సభకు వచ్చిన ప్రధాన మంత్రి మోదీకి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో పూజ, దర్శనం అనంతరం బహిరంగ సభ వద్దకు మోదీ చేరుకున్నారు. సభకు వచ్చిన ప్రజలు మోదీమోదీ అంటూ నినాదాలు హోరెత్తించారు. ప్రధాని ప్రసంగించగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తెలుగులో అనువదించారు.

● ఉదయం 10 గంటలకే ఇంత జనమా..

సభ ఉదయం 10 గంటలకే జరిగినా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంపై మోదీ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇంత ఉదయమే పెద్ద ఎత్తున్న ప్రజలు తరలిరావడం ఎక్కడా చూడలేదన్నారు. తమను ఆశీర్వదించేందుకు వచ్చిన ప్రజలను శిరస్సు వంచి నమస్కరించారు. బండి సంజయ్‌ని చేయి పట్టి అభినందించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విజయం ముందే ఖాయమైంద న్నారు. సభ జరుగుతుండగా బీజేపీ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

● కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు...

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా పోలీసులు వేములవాడలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్ ఎస్‌జీ, భద్రతా బలగాలు, పోలీసులు 1200 మందితో బందోబస్తు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గస్తీ నిర్వహించాయి.

● కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి గురించి మాట్లాడిన కాంగ్రెస్ సరైన దర్యాప్తు జరగకుండా బీఆర్ఎస్‌ను కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలు, సిండికేట్ పార్టీలేనని అన్నారు. కరీంగనర్‌లో బండి సంజయ్ విజయం ముందే నిర్ణయమైందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గురించి ఎవరికీ తెలియదన్నారు. పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించిందని ఆయన విమర్శిం చారు. పీవీ మరణం తరువాత ఆయన పార్థివదేహాన్ని గౌరవించకుండా బయటకు తరలించిందని అన్నారు. పీవీకి భారతరత్నతో గౌరవించిన ఘనత బీజేపీదేనని అన్నారు. హైదరాబాద్‌లో పీవీ కుటుంబ సభ్యులను కలుసుకున్నానని మూడు తరాలతో ముచ్చటించే అదృష్టం దక్కిందని అన్నారు.

● రాజన్నకు పూజలు, కోడె మొక్కు

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం వేములవాడకు వచ్చిన ఆయన రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వద్దకు చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామిని, రాజరాజేశ్వర స్వామి వారిని, రాజరాజేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, నమిలికొండ ఉమేష్‌శర్మ ప్రధాని మోదీకి స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు.

● రాజన్నను దర్శించుకున్న తొలి ప్రధాని

రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న తొలి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర మంత్రులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నప్పటికీ దేశంలోనే అత్యున్నత పదవి అయిన ప్రధానమంత్రి హోదాలో ఉన్న వారెవరూ వేములవాడను సందర్శించలేదు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అభ్యర్థులు

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగిరి, మే 8: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్లలో జరిగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్‌లను ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నమోదైన ఈవీఎం యంత్రాల తరలింపునకు స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. మే 13న పోలింగ్ ముగిసిన అనంతరం పోలైన ఈవీఎం యంత్రాలు రిసెప్షన్ కేంద్రాల నుంచి నేరుగా జేఎన్టీయూ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకుంటాయని తెలిపారు. జేఎన్టీయూ కళాశాలలో నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించి తగిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఈవీఎంలను భద్రపరిచేందుకు నియోజకవర్గాల వారీగా ముందుగానే మార్కింగ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్ట్రాంగ్‌రూం వెలుపల సీసీ కెమెరాలు, పోలీసుల పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అధికారులు అప్రమత్తతో వ్యవహరించాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట సహాయ రిటర్నింగ్ అధికారులు హనుమానాయక్, గంగయ్య, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు

పెద్దపల్లిటౌన్, మే 8: పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఈనెల 10 వరకు గడువు పొడిగించినట్లు పెద్దపల్లి అసెంబ్లి సెగ్మెంట్ ఎన్నికల సహాయ అధికారి బి.గంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఎంచుకున్న వారందరూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బి.గంగయ్య కోరారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మంథని ఆర్డీవో

మంథని, మే 8: పోస్టల్ బ్యాలెట్ ద్వారా మంథని ఆర్డీవో, పార్లమెంట్ ఎన్నికల ఏఆర్‌వో హనుమానాయక్, మంథని సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలె ట్ కేంద్రంలో తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఈ కేంద్రాన్ని ఈనెల 9,10 తేదీల వరకు పొడిగించినట్లు ఆర్డీవో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా దరఖాస్తు చేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.


పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న ఆర్డీవో

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మే 8: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో భారీగా కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. స్థానిక విశ్వబ్రాహ్మణవీధి, పోచమ్మవాడకట్టు, మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నేతలు, స్థానికులు కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి శ్రీధర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు. వార్డుల్లో ప్రజల కోసం మౌళిక వసతులు కల్పించడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపడుతామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. డీసీసీ అధికార ప్రతినిధి ఇనుముల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నేతలు వొడ్నాల శ్రీనివాస్, శ్రీరాంభట్ల సంతోషిణి, ముస్కుల సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతోనే అన్ని వర్గాలకు న్యాయం..

కమాన్‌పూర్, మే 8 : కాంగ్రెస్ గెలుపుతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని కెఎన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఇనగంటి రామారావు, పాలకుర్తి మండల నాయకులు పిట్ల గోపాల్, మల్క రామస్వామి, అలాగే పాలకుర్తి నుంచి కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కుండా కప్పి ఆహ్వానించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే సమాచారం ఇవ్వాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 8: జిల్లాలో మంగళవారం కురిసిన అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని, ఏ రైతు కూడా అధైర్యపడవద్దని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొంటామని, ఎవరైనా అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఫోన్‌లో మాట్లాడి రైతాంగానికి అండగా ఉండాలని, వారికి భరోసా కల్పించాలని సూచించామని, వర్షానికి తడిసిన ప్రతిగింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

సుల్తానాబాద్, మే 8: అకాల వర్షాల వలన జిల్లాలోని ఆయా కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం కొనుగోలు గురించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. సుల్తానాబాద్ సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన సుల్తానాబాద్, సుగ్లాంపల్లి గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బుధవారం సందర్శించారు. మంగళవారం అకాల వర్షాల వలన ఆయా కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టించాలని, వాటిని ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. ఈ మేరకు తాము రైస్ మిల్లర్లతో మాట్లాడుతామని, రైతులను ఎవరూ ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. తడిసిన ధాన్యంను ఈ ఎండలకు ఆరబెట్టి వాటిని మిల్లర్లకు పంపించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.


సుగ్లాంపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కొనుగోళ్లను వేగవంతం చేయాలి..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. వాతావరణంలో ఆకస్మికంగా మార్పులు వస్తున్న నేపథ్యంలో అకాల వర్షాలు వచ్చే సూచనలు ఉన్నందున వెంటవెంటనే కొనుగోళ్లు చేయాలని, వాటిని కూడా వెంటవెంటనే సమీప మిల్లర్లకు పంపించాలని అన్నారు. వర్షాల మూలంగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం కుప్పలు తడవకుండా అందుబాటులో కవర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ శంకర్, సొసైటీ సీఈవో బూరుగు సంతోష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవాలి

- జిల్లా సహకార అధికారి శ్రీమాల

మంథని, మే 8: అకాల వర్షాల నుంచి రైతులు తమ పంటలను కాపాడుకోవాలని జిల్లా సహకార అధికారి శ్రీమాల కోరారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంనగర్, గంగాపురి, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆమె బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం అకాల వర్షాలకు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు సైతం అప్రమత్తం చేయాలన్నారు. టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆమె వెంట సూరిపరిండెంట్ సువర్ణ, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించాలి

జూలపల్లి, మే 8 : మండలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎంపీడీవో పద్మజ అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం ఆమె మిషన్ భగీరథ అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామంలో చేపట్టిన మిషన్ భగీరథ తాగునీటి పనులను, పనిచేయని బోర్‌వెల్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా..

ధర్మారం, మే 8: మండలంలోని ఖిలావనపర్తి మాజీ ఎంపీటీసీ సభ్యుడు తాళ్లపల్లి రమేష్, మాజీ సర్పంచ్ సాగంటి తారకొండయ్యలతోపాటు పలువురు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపునకు మద్దతు ప్రకటిస్తున్నట్టు వారు ఒక ప్రకటనలో ప్రకటించారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా

- పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం వంశీకృష్ణ

పెద్దపల్లి టౌన్, మే 8: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. స్థానిక ఆర్కే గార్డెన్లో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఇండస్ట్రీలు ఏర్పాటు చేయించి ఈప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించేలా ఎన్ఎస్‌యూఐ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. దేశంలో ఏడాదికి 2కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోదీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. అయోధ్య రామ మందిరం నిర్మాణం, శ్రీరామున్ని బీజేపీ ఎన్నికల కోసం వాడుకోవడం దురదృష్టమన్నారు.ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ రాజకీయాల్లో యువతకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనన్నారు. రెండుపార్టీలు ఒకే అజెండాతో పనిచేస్తున్నాయని. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్, నాయకులు దుద్దిళ్ల శ్రీనుబాబు, జడ్పీటీసీ బండారి రాంమూర్తి, మినుపాల ప్రకాష్‌రావు, అన్నయ్య గౌడ్, నూగిల్ల మల్లయ్య, భూషణవేన సురేష్‌గౌడ్, ఉప్పు రాజు, మస్రత్, రేగుంట అశోక్ గౌడ్, కడార్ల శ్రీనివాస్, బొంకూరి అవినాష్, బండారి సునీల్ గౌడ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు రంగంపల్లి నుంచి పెద్దపల్లి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ అభ్యర్థికి వికలాంగుల సంఘాల జేఏసీ మద్దతు

పెద్దపల్లిటౌన్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ వికలాంగుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నారా నాగేశ్వర్‌రావు తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఫ్రెండ్లీ ఎన్విరాన్ మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ ప్రధానకార్యదర్శి చెరుకు నాగభూషణం, అఖిల భారత దివ్యాంగుల ఐక్య వేదిక అధ్యక్షుడు పల్లెబోయిన సుధాకర్ వర్మలతో కలిసి మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని దివ్యాంగులు పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపుకు కృషి చేయాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆపార్టీ అభ్యర్థుల గెలుపుకు రాష్ట్రంలోని దివ్యాంగులు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

మహనీయుల ఆశయ సాధన సంఘం..

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తామని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపకుడు బొంకూరి కైలాసం, ప్రగతి మత్స్య కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వంశీ గెలుపు కోసం అంబేద్కర్ సంఘం, బీసీ సంఘాలతో కలిసి ప్రచారం చేస్తున్నామన్నారు. పొనగంటి రాజ నర్సు, వొడ్డేపల్లి ఎల్లేష్, మధు, పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన


నిరసన తెలుపుతున్న వైద్యులు

కళ్యాణ్‌నగర్, మే 8: జగిత్యాల జిల్లా కోరుట్ల అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యునిపై, వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు శిరీష మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఓ రోగి అపస్మారక స్థితిలో వచ్చారని, ఆయన మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డాడని, కానీ వైద్యునిపై మృతుని బంధువులు డీజిల్ పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఎవరూ కూడా రోగిని చంపాలని చూడరని, వైద్యుడు అప్పటికే మృతుని బంధువులతో మాట్లాడి పక్క రూంలోకి వెళ్లి గడియ పెట్టుకోగా, అక్కడున్న కొందరు డీజిల్ పోయడంతో పాటు ఆసుపత్రి పరికరాలను ధ్వంసం చేయడం సరైంది కాదన్నారు. వైద్యునిపై అకారణంగా సస్పెన్షన్ వేటు వేశారని, నిజానిజాలు తెలియకుండా సస్పెండ్ ఎలా చేస్తారని, వైద్యునిపై విధించిన సస్పెన్షను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యంపై రైతుల నిరసన

చందుర్తి, మే 8: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు బుధవారం చందుర్తిలో నిరసన తెలిపారు. చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, చందుర్తికి చెందిన రైతులు ధాన్యం జాప్యాన్ని నిరసిస్తూ చం దుర్తి సింగిల్ విండో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయంకి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య మాట్లాడుతూ మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యిం దన్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి నెలరోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు 50 శాతం వరకు దళారులే రైతుల ధాన్యం తూకం వేశార న్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించి కొనుగోలు కేంద్రాల్లో సీరియల్‌గా, ధాన్యం సక్రమంగా తూకం వేయడం లేదన్నారు. చందుర్తి సింగిల్ విండో ఛైర్మన్‌ను, సిబ్బందిని అడిగితే లారీల కొరతతో ధాన్యం కొను గోలు ఆలస్యం అవుతుందని సమాధానం ఇస్తున్నారన్నారు. జిల్లా అధికారుల తో మాట్లాడితే ప్రతి రోజూ 15 లారీలలో ధాన్యం తరలిస్తూ, ధాన్యం తూకం వేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు తప్ప, కొనుగోలు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, లేనిచో రైతులు రోడ్డుపై ధర్నా చేయక తప్పదన్నారు. అవసరమనుకుంటే చలో కలెక్టర్ చేపడతామ న్నారు. సంచికి 41,600 చెప్పి కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నార న్నారు. ధాన్యం తూకం వేసిన లారీకి 240 క్వింటాలు తరుగు పేరున కటింగ్ చేస్తున్నారన్నారు. చందుర్తికి చెందిన బత్తుల వసంతరావు అనే రైతుకు 80 కిలోలు, మర్రి నిశాంత్ అనే రైతుకు చెందిన ధాన్యం 80 కిలోలు, బత్తుల సూర్యరావు 80 కిలోలు కటింగ్ చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దేవారెడ్డి సత్తిరెడ్డి, తిప్పని శంకర్, తిప్పని గంగయ్య, గుమ్మ శంకర్, దుమ్ము నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఆర్‌ఎంపీ వైద్యులకు విందు.. ఎన్నికల అధికారుల విచారణ

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు హుజూరాబాద్ మండలంలోని ఆర్‌ఎంపీ వైద్యులకు విందు ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన కార్యకర్తలు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల ఫ్లాయింగ్ స్క్వాడ్, పోలీసులు సదరు ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకున్నారు. ఇది గమనించిన ఆర్‌ఎంపీ వైద్యులు, విందు ఇచ్చిన సదరు రాజకీయ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఎన్నికలాధికారులు అడ్డుకొని విచారించారు. సదరు ఆర్‌ఎంపీ వైద్యులు ఎన్నికలాధికారులు నిలదీయగా, బర్త్‌డే ఫంక్షన్‌కు వచ్చామని తెలిపారు. బర్త్‌డే ఫంక్షన్ చేసుకుంటే ఎన్నికలాధికారి అనుమతి తీసుకోవాలని ఎన్నికలాధికారులు ప్రశ్నించారు. ఈ లోగానే ఆర్‌ఎంపీ వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా అప్పటికే ఆర్‌ఎంపీ వైద్యులకు గ్రామాల్లో ప్రచారం చేయడానికి నజరానా ముట్టజెప్పినట్లు తెలిసింది. గత నాలుగు రోజుల క్రితం కూడా ప్రైవేట్ టీచర్లకు ఈ ఫంక్షన్ హాల్‌లో విందు ఇచ్చినట్లు తెలిసింది. పూర్తి నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వను న్నట్లు ఫ్లాయింగ్ స్క్వాడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, మే 8: గంగాధర గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్‌కు విద్యుత్ ఘాతంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర పంచాయతీలో షహీద్ పాషా విద్యుత్ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బుధవారం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడానికి విద్యుత్ సిబ్బంది షహీద్‌ను తీసుకెళ్లారు. కాగా సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్న లైన్‌మెన్ జంపర్ మార్పిడి చేయడానికి షహీద్‌ను స్తంభం ఎక్కించారు. రాంగ్ ఎల్‌సీతో షహీద్ విద్యుత్ షాక్‌తో కిందపడిపోయాడు. దీంతో అతడి కుడి చేయి నరాలు పూర్తితెగిపోయినట్లు సమాచారం. క్షతగాత్రుడిని కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని తెలిసింది. దీనిపై ఏడీని వివరణ కోరగా సబ్ స్టేషన్ ఆపరేటర్, లైన్ మెన్ కమ్యూనికేషన్ లోపంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, మే 8: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లవేని శ్రీనివాస్ రోజులాగే తన పొలం వద్ద లేగ దూడను కట్టేసి ఉంచాడు. మంగళవారం రాత్రి లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. 40 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

తిమ్మాపూర్‌లో అగ్ని ప్రమాదం

- గుడిసె, పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ శివారు లోని మైసమ్మ చెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. రైతులు అల్లె ముత్తయ్య, ప్రదీప్, కొల కాని లక్ష్మయ్య, రవి, శ్రీనివాస్‌కు చెందిన సుమారు 100 గడ్డి కట్టలు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిపోయాయి. అల్లె ముత్తయ్య, ప్రదీప్‌కు చెందిన గుడిసెతోపాటు అందులోని సామగ్రి దగ్ధమయ్యాయి. చుట్ట పక్కల రైతులు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. అధికారులు నష్టం అంచనావేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రమా దం జరిగిన తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవా లని మాజీ ఏఎంసీ ఛైర్మన్, అందె సుభాష్, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్, శంకర్, శేఖర్ సతీష్ కోరారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మే 8: చదువుకోమంటూ తల్లి మందలించడంతో కూతురు ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన శ్రీనిధి ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతోంది. హైదరాబాద్ వెళ్లి పరీక్ష రాయాల్సి ఉందని, సెల్‌ఫోన్‌తో కాల క్షేపం చేయవద్దంటూ తల్లి పద్మ కూతురును మందలించింది. అనంతరం ఆమె పనికి వెళ్లింది. ఇంట్లో ఉన్న శ్రీనిధి తల్లి మాటలకు మనస్థాపం చెంది తన ఎడమ చేయి మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిఫా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొలగాని శ్రీనివాస్



నిఫా కార్యవర్గసభ్యులతో కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, మే 8: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్ (నిఫా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌లోని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ నియామకమయ్యారు. డిల్లీలో జరిగిన నిఫా జాతీయకార్యవర్గ సమావేశంలో కొలగాని శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు స్వచ్ఛంద, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ నిఫా ఆర్గనైజేషన్‌లో భాగస్వామినైనందుకు సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన నిఫా జాతీయ నాయకత్వానికి కృతజ్ఞ తలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిఫా ఆధ్వర్యంలో స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తానన్నారు. నిఫా జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం డిల్లీలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు.

మద్యం పట్టివేత

మానకొండూర్, మే 8 : మానకొండూర్ మాజీ సర్పంచు పృథ్వీరాజ్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బుధవారం రాత్రి పట్టుకున్న ట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ సమాచారం మేరకు పృథ్వీరాజ్ ఇంటిపై దాడి చేయగా 48 రాయల్ స్టాగ్ క్వార్టర్స్, 22 బీర్లు లభ్యమైనట్లు సీఐ తెలిపారు. మద్యం విలువ రూ. 15 వేలు కాగా వాటి ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సజావుగా ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు



తిమ్మాపూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, మే 8: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షల బుధవారం జిల్లాలో రెండో రుజూ సజావుగా జరిగాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకే సెషన్‌లో జరిగింది. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించారు. 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,931 మంది విద్యార్థులకు గానూ 2,738 మంది హాజరయ్యారు. మొత్తంగా 93.42శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళ, బుధ వారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం పరీక్షలు జరిగాయి. కాగా 9,10,11 తేదీల్లో మూడు రోజుల పాటు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తిరిగి మధ్నాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు.

స్వగ్రామం చేరిన యువకుడి మృతదేహం

బీర్‌పూర్, మే 8: గల్ఫ్ దేశంలో చికిత్స పొందుతూ మృతిచెందిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బంద్ర రాజేష్(30) అనే యువకుడు కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయికి వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఏప్రిల్ 27న దుబాయ్‌లో మృతి చెందాడు. రాజేష్ మృతదేహం గ్రామానికి రావడంతో రాజేష్ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

జగిత్యాలలో వైద్యుల ఆందోళన



మాట్లాడుతున్న తాటిపాముల సురేష్

జగిత్యాల టౌన్, మే 8 :జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుడు శ్రవణ్, సిబ్బందిపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ హాలులో అధ్యక్షుడు తాటిపాముల సురేష్ కుమార్ మాట్లాడుతూ వైద్యునితో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు రోగుల బాగుకోసమే పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అజయ్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ కళ్యాణ్ కుమార్, వైద్యులు సుధీర్, రమేష్, శ్రీనివాస రెడ్డి, సుజిత్, సురేష్, వేణు బాబు, రాహుల్, రాము, మహేంద్ర నాథ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పనుల ప్రగతి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నాబార్డు నిధులతో చేపట్టిన పనుల ప్రగతిని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర బుధవారం పరిశీలించారు. నాబార్డు ద్వారా అందిస్తున్న పథకాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఆధునిక భవనం, గోదాం, సర్వేపల్లి శివారులోని పెట్రోలు బంకును పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాలకు నాబార్డు కింద నిధులను అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ ప్రగతి పథంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర అన్నారు. అధికారులు సత్యనారాయణ, విష్ణు, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ ఉన్నారు.

అడవిని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

- డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు

రాయికల్, మే 8: అడవిని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అటవీ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో ఉపాధిహామీ కూలీలతో సమావేశమై మాట్లాడుతూ ఇంకుడు గుంతలు తీయడం వల్ల వర్షాకాలంలో నీరు భూమిలోకి ఇంకుతాయని, దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. వర్షాలు పడటంతో పంటలు సమృద్ధిగా పండుతాయని సూచించారు. అడవులను కాపాడుకోవడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, ఉష్ణోగ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ వారి ఇళ్లల్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. అడవిని ఎవరైనా నరికితే అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ప్రణీత్ కౌర్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రవి కుమార్, ఎఫ్‌బీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎస్ చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు పలువురు ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి గోడు వెల్లబోసుకున్నారు. సుమారు గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి వేతనం పెంపుదల జరగడం లేదని వివరించారు. సివిల్ సప్లయి జిల్లా కార్యాలయంలో పీడీఎస్, సీఎంఆర్, ధాన్యం రవాణా, ఎంఎల్ఎస్ పాయింట్ గన్నీస్, గోడౌన్, క్యాషియర్ తదితర విభాగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు జి వంశీ, అరవింద్, మధు, సతీష్, జగన్, సంజయ్, రాంరెడ్డి, శ్రీనివాస్, రాజు, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతీ ధాన్యం గింజ కొంటాం



గంగాధరలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ చౌహాన్

- రైతులకు నష్టం జరగనివ్వం
- ఎలాంటి ఆందోళన చెందొద్దు
- తరుగుపేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు
- పంటకు మద్దతు ధర అందిస్తాం
- రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

గంగాధర, మే 8: అకాల వర్షానికి తడిసిన ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గంగాధర మండల కేంద్రంతో పాటు మధురానగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా కేంద్రాల్లో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోనే ధాన్యం పోసిన రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా, మద్దతు ధర అందుతుందా, అకౌంట్లో డబ్బులు పడ్డాయా అని వివరాలు అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మనోధైర్యం, భరోసా కల్పించేందుకే జిల్లాలో పర్యటిస్తున్నానన్నారు. రైతులకు నష్టం జరగనివ్వమని, ఏలాంటి భయం వద్దని చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులైనా తాము భరిస్తామని రైతులకుఇబ్బంది కలగనివ్వమన్నారు. మిల్లర్లు తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క గ్రాం ధాన్యమైన కోత విధించే అధికారం మిల్లర్లతో పాటు ఎవ్వరికి లేదని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో అధికారులతో సమావేశం నిర్వహించి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతితోను పలు అంశాలపై మాట్లాడానని తెలిపారు. అకాల వర్షం పడే అవకాశం ఉన్నందున వారం రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారీగా ప్రతి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. తేమశాతం సరిగా వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లర్లకు సమాచారం ఇచ్చి ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. ఆ తరువాత తూకం వేసిన ధాన్యం తడిసిన రైతులకు ఏలాంటి నష్టం జరగకుండా చూస్తామని భరోసా కల్పించారు. ధాన్యం బాయిల్డ్ రైస్‌కు ఉపయోగపడుతుందని, మిల్లర్లకు సైతం ఏలాంటి నష్టం కలగదని చెప్పారు. అధికారుల ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని క్లీన్‌చేసి కొనుగోలుకేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధర పొందవచ్చని సూచించారు. అధికారులు ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్, గంగాధర ఏడీఏ రామారావు తదితరులు ఉన్నారు.

● రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

భగత్‌నగర్, మే 8: రైతులకు ఇబ్బందులు రాకుండా తేమ శాతం సరిగా రాగానే ధాన్యాన్ని తూకం వేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సెల్‌నెంబర్‌లు నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది, ఎంత డబ్బు జమ చేశారు అని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ ద్వారా రైతు లచ్చయ్యతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయీస్ డీఎం రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.



మల్యాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న కమిషనర్ చౌహాన్

మల్యాల: అకాల వర్షాలతో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. మల్యాల మండలంలోని రామన్నపేట, మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్ చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయరనే అపోహలు, అనుమానాలు వద్దని రైతులకు నష్టం జరుగకుండా చూస్తామని తెలిపారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తూకం వేయడంతో నష్టపోతున్నామని ఈ సందర్భంగా రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా బస్తాకు 40 కిలోల 600 గ్రాముల కన్నా ఎక్కువ ఏ మాత్రం తూకం వేయకూడదని నిర్వాహకులకు సూచించారు. ఈ విషయాన్ని తాను మిల్లర్ల సమావేశంలో తెలుపుతానని అన్నారు. గతంలో కన్న ముందుగా ఈ సారి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని కొనుగోళ్ల వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచుల కొరత లేదని తెలిపారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత ఉందని నిర్వాహకులు తెలపగా అక్కడే ఉన్న పౌరసరఫరాల అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం విక్రయించిన రైతులకు ఫోన్ చేసి ధాన్యం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయా లేదా అని తెలుసుకున్నారు. కమిషనర్ వెంట అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో సంపత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, సివిల్‌సప్లయ్ అధికారి వెంకటేశ్వర్‌రావు, మేనేజర్ హతీరాం, డీపీఎం విజయభారతి, మల్లేశం, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏపీవో చిన్న రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి: వేగంగా వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని పౌర సరఫరాలకమిషనర్ డీఎస్ చౌహాన్‌ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి, నేరెళ్ల గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంకిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి డబ్బులు పొందిన రైతుతో కొనుగోలు కేంద్రం నిర్వాహకుడి ద్వారా కమీషనర్ ఫోన్‌చేయించి స్వయంగా మాట్లాడారు. డబ్బులు ఎన్ని రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని, ఏమైనా ఇబ్బందులు ఎదురు అయ్యాయా అని ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కాలేదని సదరు రైతు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధాన్యం సేకరణ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీవో పాపారావు తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, మే 8: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం పోలీసుల తనిఖీల్లో నగదు పట్టుబడింది. కరీంనగర్‌లో పోలీసులు బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 2లక్షల 9 వేల 6 వందల రూపాయలు నగదు పట్టుబడిందని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. రాజీవ్‌చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తిలక్‌రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ వద్ద సరైనా ఆధారాలు లేకుండా నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదును తదుపరి ప్రక్రియ నిమిత్తం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 58,800 నగదు పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన మోరె విజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ. 58,800 నగదు తీసుకెళ్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న నగదును సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 9.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. తనిఖీల్లో ఎస్సైలు నరేష్ , మన్మధరావు తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు వేరువేరుగా తమ ద్విచక్ర వాహనాలపై 1.80 లక్షలు, 1.50 లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదుకు ఎలాంటి ఆధారాలను చూపించక పోవడంతో అతని వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకోని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా వ్యాపారరీత్యా లేదా ఆసపత్రితో పాటు ఏదైనా అత్యవసర పరిస్థితిల్లో రూ. 50వేలకు పైగా డబ్బులు తరలిస్తే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు

400 చీరలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మే 8 : కరీంనగర్‌లో పోలీసులు బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలలో 400 చీరలు పట్టుబడ్డాయి. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో వ్యాన్(టీఎస్ 13 ఈటీ 2549)లో సరైన రశీదులు లేని అక్రమంగా తరలిస్తున్న దాదాపు 3 లక్షల రూపాయల విలువ చేసే 400 చీరలతో పాటు ఇతర దుస్తులను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ నుంచి ధర్మపురికి ఈ చీరలు తరలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన చీరలను తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు. విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.



చీరలను పట్టుకున్న పోలీసులు

అక్రమ లేఅవుట్లపై విచారణకు ఐజీ ఆదేశం

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలో ఏడాది కాలంలో ఏర్పాటు చేసి అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల క్రితం జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో అమ్మిన భూముల రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. కాగా నాలుగు రోజులుగా దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విచారణతో నాలా కన్వర్షన్, మున్సిపల్ అనుమతి లేకుండా భూములు కొనుగోలు చేసిన వారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఈ విచారణ జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే ముందస్తుగానే సెలవుపై వెళ్లాడు. దీంతో మరొకరిని సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్న కుంభకోణాలు బయట పడనున్నాయి.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'

మెట్‌పల్లి, మే 8: కోరుట్ల ప్రభుత్వ ఆసపత్రిలోని డ్యూటీలో ఉన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల కితం జరిగిన సంఘటనలో డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ప్రతి వైద్యుడు తమ వద్దకు వచ్చిన రోగిని కాపాడాలనే నిబద్ధతో వైద్యం చేస్తారన్నారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఒంటిపై కిరోసిన్ పోయడంతో పాటు దాడి చేయడాన్ని ఐఎంఏ తరుఫున ఖండిస్తున్నట్లు తెలిపారు. వైద్యుడిపై దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ యూనియన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆనంద్‌బాబు, జాకబ్‌కిరణ్, రమేష్‌రెడ్డి, విద్యాసాగర్, త్రిలోక్, నిర్మల్‌రెడ్డి, పద్మ, త్రివేణి, మానస, సభ్యులు,తదితరులు పాల్గొన్నారు,



ప్రజలు, పార్టీశ్రేణులకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు వస్తున్న ప్రజలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రధాని మోదీ, ఇతర నేతల భారీ కటౌట్లు



సభకు తరలివస్తున్న మహిళలు

ప్రధాని మోదీ సభ
చిత్రమాలిక

వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నాయకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజ య్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రే ణులు సంతోషం వ్యక్తం చేశాయి.



సభకు హాజరైన మహిళలు



సభ వద్ద పోలీసుల బందోబస్తు



సభకు హాజరైన జనం, కార్యకర్తలు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు, కార్యకర్తలు

సమస్యల పరిష్కారానికి కృషి

సుల్తానాబాద్, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, తనను ఆశీర్వదించాలని పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలను అభ్యర్థించారు. సుల్తానాబాద్ బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఈశ్వర్ మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, సూర శ్యామ్, పాల రామారావు, అంజయ్య, మైలారం నారాయణ, రాజమల్లయ్య, గడ్డం మహిపాల్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, సందీప్ రావు, గొట్టం లక్ష్మి, గుణపతి, గోపి, బాబురావు, భూమేష్, శంకర్, మహేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం

మంథనిరూరల్, మే 8: మండలంలోని బిట్టుపల్లి, గద్దలపల్లి, లక్కెపూర్ గ్రామాల్లో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నేతలు శశిభూషణ్‌కాచే, రావికంటి సతీష్, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఎంపీగా గెలిపించాలని కోరారు.

ధర్మారంలో..

ధర్మారం, మే 8: పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని చామనపల్లి, న్యూ కొత్తపల్లి గ్రామాల్లో ఉపాధి పనుల ప్రదేశాల వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణను గెలిపించాలని కోరారు.

ఓదెలలో..

ఓదెల, మే 8 : మండలంలోని ఇందుర్తి, బాయమ్మపల్లి, కొమిర, లంబాడ తండా తదితర గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పడాల రాజు, గిరాం సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారం మే 8: మండలంలోని మచ్చపేటలో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు చొప్పరి సదానందం, దొడ్డ బాలాజీ, బియ్యని శివకుమార్, గోవిందుల పద్మఆనంద్, మాజీ ఎంపీపీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొప్పులకు మద్దతుగా ప్రచారం

ధర్మారం,మే8: పెద్దపల్లి ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం బుధవారం మండలంలోని కమ్మరిఖాన్‌పేట, లంబాడితండ (కె)గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.

రామగిరిలో..

రామగిరి, మే 8: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్ మాట్లాడారు. కొప్పుల ఈశ్వర్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథనిరూరల్, మే 8: పెద్దపల్లి పార్లమెంట్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని జడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. మండలంలోని గుంజపడుగులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తగరం శంకర్‌లాల్, ఎక్కేటి అనంతరెడ్డి, బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, దేవళ్ళ విజయ్‌కుమార్, కండె రమేష్, పెగడ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి, మే 8 : మండలంలోని బసంత్‌నగర్‌లో బుధవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కౌశికహరి, జడ్పీటీసీ ఆముల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి గెలుపు కోసం కూతురు ప్రచారం

ధర్మారం, మే 8: పెద్దపల్లి ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం బుధవారం సాయంత్రం మండలంలోని కొత్తూర్‌లో ఆయన కూతురు నందిని ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి

ఎలిగేడు, మే 8 : బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం మధుర ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

పెద్దపల్లి రూరల్, మే 8 : పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించాలని పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మేకల శ్రీనివాస్ యాదవ్, వేల్పుల రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి రాజీనామా

ముత్తారం మే 8: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఏట సంపత్ బీఎస్పీ ప్రాథమిక సభ్యత్వానికి, మంథని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు

ముత్తారం, మే 8: గత రెండు రోజులుగా వీచిన ఈదురు గాలులకు, వర్షానికి మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఉప్పుల జగదీష్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఉప్పుల జగదీష్ ఇల్లు కూలిపోవడంతో వారి కుటుంబం నిరాశ్రయులయ్యారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గడ్డం వంశీని గెలిపించాలని ఎమ్మెల్యే ప్రచారం

పెద్దపల్లి రూరల్, మే 8 : పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని భోజన్నపేట, మూలసాల, గుర్రాంపల్లి, మారేడుగొండ, దావన్నపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మే 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీమెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలిగేడులో..

ఎలిగేడు, మే 8 : కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని నారాయణపల్లి, ఎలిగేడు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే13న జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో యువకుడు రాజకీయ వారసత్వం గల అభ్యర్థి వంశీది చెయ్యి గుర్తు అని ప్రచారం చేశారు. విండో మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అడ్డగుంట శ్రీనివాస్, చింతిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మే 8: అకాల వర్షం వడగళ్ల వానతో వరి ధాన్యం, మామిడి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకొని నష్టపరిహారం చెల్లిస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం వడగాల వానతో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని, వడగళ్ల వానతో మామిడి తోటల్లో నేలరాలిన కాయలను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించి రైతులకు అండగా ఉంటామని తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులెవరూ అధైర్యపడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షం వడగళ్ల వాన పడడం బాధాకరమన్నారు. అకాల వర్షం, వడగళ్ల వానతో రైతులకు తీవ్ర నష్టం వాటిలిందన్నారు. నష్టపోయిన రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళనకు గురి కావద్దన్నారు. మామిడి తోట రైతులకు వడగళ్ల వానతో నష్టం వాటిల్లిందని, తోటలోని మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి నష్టపరిహారం అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలాగా చూసి రాసుకొనిపోయి కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇచ్చితంగా పరిహారం అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రన్‌రెడ్డి, పులి ఇంద్రకరణ్‌రెడ్డి, తుల మనోహర్‌రావు మాదాసి సతీష్ అల్లం దేవేందర్, నబ్బని రాజమల్లు, బంగారు రమేష్, శివరామకృష్ణ, జిన్న రామచంద్రం రెడ్డి, పొట్యాల మొండయ్య, గోలి సుధాకర్ తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

కాల్వశ్రీరాంపూర్, మే 8: అకాల వర్షానికి వరి పంట, మామిడిపంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం జడ్‌పీటీసీ కాల్వశ్రీరాంపూర్‌లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని, రాలిన మామిడి కాయలను పరిశీలించారు. రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంట చేతికచ్చే దశలోనే ప్రకృతి కన్నెర్ర చేసి నిలువున ముంచిందని అన్నారు. ఈ విషయమై వెంటనే ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారుల ద్వారా సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి అన్నారు. ఆయన వెంట మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ ఇబ్రహీం, ఆడెపు రాజు, సుదాటి కరుణాకర్‌రావు, రంజిత్‌రెడ్డి, కుమార్ ఉన్నారు.

ఎకరానికి రూ.25వేలు పరిహారం చెల్లించాలి

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈశ్వర్



పెద్దబొంకూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఈశ్వర్

పెద్దపల్లి రూరల్, మే 8 : అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. మండలంలోని పెద్ద బొంకూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం వర్షానికి తడిసిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి కొప్పుల ఈశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో మాత్రం రైతులకు సాగునీరు అందించకపోవడంతో పంట పొలాలు ఎండిపోయాయన్నారు. మిగిలిన పంటను కాపాడుకుందామంటే అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంట ఎంపీపీ బండారి స్రవంతి-శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : మండలంలో కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని నాయకులు పరిశీలించారు. అధికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.రాచూరి శ్రీధర్, పూస్కూరి రామారావు, తుమ్మల రాంబాబు తదితరులు ఉన్నారు,

సింబల్ లోడింగ్ యూనిట్లు స్ట్రాంగ్ రూంలో భద్రం



సింబల్ లోడింగ్ యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, మే 8: భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సింబల్ లోడింగ్ యూనిట్లను సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చామని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో పెద్దపల్లి, రామగుండం, మంథని మూడు నియోజకవర్గాలకు చెందిన సింబల్ లోడింగ్ యూనిట్లతో పాటు, రిజర్వ్ యూనిట్ లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ, వీవీ ప్యాట్లలో అభ్యర్థుల చిహ్నాలను లోడ్ చేయడానికి ఉపయోగించే పరికరాలను సింబల్ లోడింగ్ యూనిట్లు అంటారని, సింబల్ లోడింగ్ యూనిట్ లను ఫలితాలు ప్రకటించిన తర్వాత కనీసం 45రోజుల పాటు స్ట్రాంగ్ రూంలో ఉంచబడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సింబల్ లోడింగ్ యూనిట్‌లను సీల్ చేసి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి సంబంధిత వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి అందరి సంతకాలు తీసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

జూలపల్లి, మే 8 : మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి, వైస్‌ఎంపీపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో సమాధానం చెప్పాలి

రామగిరి, మే 8: తెలంగాణలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటుతో సమాధానం చెప్పాలని మాదిగశక్తి మండల కన్వీనర్ బొంకూరి పోచం విజ్ఞప్తి చేశారు. బుధవారం పన్నూరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో దళితులను అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని, అదే విధంగా రిజర్వేషన్ రద్దు చేస్తామని ప్రకటిస్తున్న బీజేపీ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పి మాదిగల సత్తా చూపించాలని కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాలన్నారు. గద్దల శంకర్, ఉట్ల శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఇంటి స్థలం

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 8: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 200 చదరపు గజాల ఇంటి స్థలాన్ని త్వరలో ఇవ్వనున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. బుధవారం సింగరేణి సివిల్ ఆఫీస్‌లో ఉద్యోగులను, కాంట్రాక్టు కార్మికులను ఆయన కలిసి గడ్డం వంశీ కృష్ణను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిని మోసం చేసింది కేసీఆర్ అని, మళ్లీ ఏ ముఖం పెట్టుకుని కార్మికులపై సవతి తల్లి ప్రేమను కురిపిస్తున్నారని, సింగరేణిలో బినామీ పేరుతో కాంట్రాక్టులు నిర్వహించి సింగరేణి సొమ్మును కొల్లగొట్టారని, పది సంవత్సరాలు బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి కాపురం చేశాయని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేశాయని, ప్రైవేటీకరణను వేగవంతం చేశాయని ఆరోపించారు. రామగుండాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చనున్నట్టు, కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల పక్షపాతి అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్‌తో పాటు కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

- ఇండియా కూటమి నాయకులు



అభివాదం చేస్తున్న ఇండియా కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు

గోదావరిఖని, మే 8: పదేళ్ల రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను దోచుకున్నాయని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ప్రజలు తరిమికొట్టాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూపాల్ అన్నారు. బుధవారం గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం ఏర్పాటు చేసిన విస్తృత సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. గత పదేళ్ల నుంచి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండి చేసిందేమి లేదని, పెట్టుబడిదారుల సంపదలను రెట్టింపు చేయడానికే మోదీ ప్రభుత్వం పని చేసిందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను అదాని, అంబానీలకు కట్టబెట్టాయని, దేశ ఆర్థిక వ్యవస్థను వారి స్వలాభం కోసం బీజేపీ ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని, 3వ సారి అధికారంలోకి రావడానికి అయోధ్యలో రాముని విగ్రహం ప్రతిష్ఠ చేసి మత రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. పెద్దపల్లి ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, సీపీఎం నాయకులు యాకయ్య, తుమ్మల రాజారెడ్డి, సంకె రవి, సాయిలు, కుమారస్వామి, జ్యోతి, గణేష్, అశోక్, రామాచారి, ముత్యంరావు, శైలజ, అశోక్, శంకర్, లక్ష్మారెడ్డి, మహేష్, రాజు, శ్రీకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి : ఏసీపీ

పెద్దపల్లిటౌన్, మే 8: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏసీపీ గజ్జి కృష్ణ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో సాయుధ బలగాలతో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించిన అనంతరం కృష్ణ మాట్లాడారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరు ఓటు వేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వంత ఆలోచన ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్సైలు లక్ష్మన్‌రావు, మల్లేష్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణ

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

పెద్దపల్లి రూరల్, మే 8: మండలంలోని పలు గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీవో సుదర్శన్ అన్నారు. బుధవారం మండలంలోని బొంపల్లి గ్రామంలో తాగునీటి సరఫరా అయ్యే పైప్ లైన్ మరమ్మత్తు పనులను పరిశీలించారు. అలాగే గోపయ్యపల్లి గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. వారి వెంట పంచాయితి కార్యదర్శులు సతీష్, రవిందర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కాల్వశ్రీరాంపూర్, మే 8: గోవాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ నెల 19 నిర్వహిస్తున్న అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు వెన్నంపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు నిహారిక, శ్రీనిత, నిదర్శని, సాన్విక ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్, వేములవాడ, మంచిర్యాలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీలలో మంచిర్యాలలో జాతీయస్థాయిలో మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కరాటే మాస్టర్ రమేష్ తెలిపారు. గోవాకు వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేని కారణంగా బాలికలకు ఎవరైనా దాతలు ఆర్థిక సాయం అందించాలని కరాటే మాస్టర్ రమేష్ కోరారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన బాలికలను సన్మానించారు.

ఎమ్మెల్సీకి సన్మానం

కాల్వశ్రీరాంపూర్, మే 8: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తన అమ్మమ్మ స్వగ్రామమైన మండలంలోని తారుపెల్లి గ్రామానికి బుధవారం రాగా కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు అల్లం దేవేందర్, రాణవేన శ్రీనివాస్, గోపగోని శ్రీకాంత్, గీస రాజయ్య, ఐలయ్య ఉన్నారు.

విషపు నీరు తాగి గొర్రెలు మృతి

కాల్వశ్రీరాంపూర్, మే 8: మేత మేస్తూ విషపు నీరు తాగి 10 గొర్రెలు మృతిచెందాయి. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన అల్లంల కొమురయ్య, ఓజ్జ రాజయ్య, మండల చంద్రయ్యకు చెందిన 150 గొర్రెలు గ్రామ శివారులో బుధవారం మేత మేస్తూ పక్కనే ఉన్న మడుగులో నీరు తాగాయి. అనంతరం కొద్దిసేపటికే 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో గొల్ల కాపర్లు వెంటనే పశువుల డాక్టర్ సురేష్‌కు ఫోన్ చేయగా ఆయన ఇంజక్షన్లు వేశారు. మృతి చెందిన గొర్రెలను పోస్టుమార్టం చేయగా విషపు నీరు తాగి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నిలువ ఉన్న నీటిలో పురుగుల మందు కలిసినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో ఆ నీరు తాగి గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. గొర్రెలు మృతితో రూ.1.2లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, మే 8: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం చే మండలంలోని పెద్ద రాతుపెల్లి గ్రామంలో బుధవారం ఓటు హక్కుపై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఈదునూరి పద్మ, కొంద్ర వెంకన్నగౌడ్, సలేంద్ర రాజన్న, ఇల్లందుల మల్లేష్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, దీకొండ శ్రావణ్, జిన్న రమ, కన్నూరు రేణుక తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పెద్దపల్లి టౌన్, మే 8: తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. పెద్దపల్లి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ప్రచార కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ ప్రజల నిజమైన ఆకాంక్షలను ఎన్నికలలో ప్రచారంలోకి తీసుకురాకుండా, బీజేపీ నాయకులు, దేశ ప్రధాని మోదీ ముస్లింలు, మంగళ సూత్రాలులాంటి అంశాలను ప్రస్తావిస్తూ చర్చను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఉత్తర భారతదేశంలో బీజేపీ వ్యతిరేక గాలులు వీస్తున్నాయని, అందుకే మోదీ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. దక్షిణాదిలో బీజేపీకి స్థానం లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పొన్నం రాజమల్లయ్య, మార్వాడి సుదర్శన్, గాండ్ల మల్లేశం, రామిళ్ల బాపు, పులిపాక రవీందర్, కారెంగల సరేందర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలను చేయించాలి

కమాన్‌పూర్, మే8: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలను చేయించుకోవాలని రామగిరిఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పిల్లి కిరణ్ అన్నారు. మండల పరిధిలోని పెంచికల్‌పేట గ్రామంలో భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు తమ నేల భూసారాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడటం ద్వారా అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ సుస్థిర దిగుబడులు పొందవచ్చని తెలిపారు. మట్టి నమూనాల సేకరించే విధానానికి 8001804016 నెంబర్‌కి కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె సిబ్బంది రుద్రా వినాయక్ తదితరులు ఉన్నారు.

ఫోన్లు అప్పగింత

జూలపల్లి, మే 8: జూలపల్లి మండల కేంద్రానికి చెందిన ముక్కెర కొమురవ్వ అనే మహిళ రెండు సెల్‌ఫోన్లను పోగొట్టుకోగా ఆచూకీ కనుగొని ఎస్‌ఐ శ్రీధర్ వాటిని బాధితురాలికి బుధవారం అప్పగించారు. కొమురవ్వ ఇటీవల సెల్‌ఫోన్లు పోయాయని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సిఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసిన పోలీసులు ఫోన్లను గుర్తించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ శ్రీధర్ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్లు పోగొట్టుకున్నా వివరాలు సిఈఐఆర్‌లో నమోదు చేయాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అందిస్తామన్నారు.

'ఆర్‌ఎఫ్‌సీఎల్ దందాకు సూత్రధారులు చందర్, శ్రీనివాసరాజులే'

కోల్‌సిటీ, మే 8: ఆర్‌ఎఫ్‌సీఎల్ దందాకు మాజీ ప్రజా ప్రతినిధి కే చందర్, అతని మిత్రుడు శ్రీనివాసరాజులే సూత్రధారులని, తాను తెరమీద బొమ్మను మాత్రమేనని ఆర్‌ఎఫ్‌సీఎల్ సబ్‌కాంట్రాక్టర్‌గా ప్రచారంలో ఉన్న గోపగోని మోహన్‌గౌడ్ ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల దందాపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ హమాలీ ఉద్యోగాల దందాలో తాను సబ్ కాంట్రాక్టర్‌ను కాదని, తనను తెరమీద బొమ్మగా పెట్టారన్నారు. చందర్ మిత్రుడు బీఎస్ రాజు చెందిన తిరుమల శంకు చక్ర(టీఎస్‌సీ) పేరు మీద సబ్ కాంట్రాక్టు అగ్రిమెంట్ ఉందని, తనను కేవలం డబ్బుల వసూలుకు ఒక ఏజెంట్‌గా మాత్రమే పని చేశానన్నారు. మరో ఇద్దరికి పనులు పెట్టించే బాధ్యత అప్పగించారన్నారు. తాను నోరువిప్పితే చంపుతామని బెదిరిస్తున్నారని, తనకు ఏం జరిగినా వారిదే బాధ్యత అని మోహన్‌గౌడ్ పేర్కొన్నారు.